సాక్షి
చిత్తూరు

మంగళవారం : 25 : జూన్ : 2024



చిత్తశుద్ధితో పరిష్కారం

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు వచ్చిన అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. - 8లో



ఆలయంపై ఏనుగుల దాడి

అడవి సమీపంలోని జలకంఠేశ్వరాలయంపై ఏనుగులు దాడి చేసి, ఇనుప కంచెను, గోడను పాక్షికంగా ధ్వంసం చేశాయి. - 8లో



కలగానే చిత్తూరు రైల్వే జంక్షన్

చిత్తూరును రైల్వే జంక్షన్‌గా చూడాలన్న జిల్లావాసుల కల కలగానే మిగిలిపోతుందేమో అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

నేడు కుప్పానికి సీఎం చంద్రబాబు

కుప్పం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం నుంచి రెండు రోజులపాటు కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆయన ఉదయం 11.50 గంటలకు బెంగళూరు విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి కుప్పానికి ప్రత్యేక విమానంలో బయల్దేరుతారు. మధ్యాహ్నం 12.30 గంటలకు కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హంద్రీనీవా కాలువ పరిశీలన కోసం శాంతిపురం మండలం జెల్లిగానిపల్లి, చిన్నారిదొడ్డి గ్రామాలను సందర్శిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు కుప్పం ఆర్టీసీ బస్టాండులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం బస్టాండులో జరిగే బహిరంగ సభకు హాజరై ప్రసంగిస్తారు. సాయంకాలం 5 గంటలకు ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. మంగళవారం రాత్రి ఆర్ అండ్ బి అతిథి గృహంలో బస చేస్తారు. రెండవ రోజు బుధవారం ఉదయం 10 గంటలకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు కుప్పం నియోజకవర్గ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అక్కడి నుంచి కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీఈఎస్ మెడికల్ కళాశాలలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు పీఈఎస్ హెలిప్యాడ్ నుంచి బెంగళూరుకు తిరుగు ప్రయాణం అవుతారు.

మున్సిపల్ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి



లేఖను అందిస్తున్న ఫక్రుద్దీన్ షరీఫ్

పుంగనూరు: పుంగనూరు ఎమ్మెల్యేగా నాలుగోసారి ఎన్నికైన మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మున్సిపాలిటీ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఉండేందుకు లేఖ పంపారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, కౌన్సిలర్ నరసింహులు కలిసి కమిషనర్ నరసింహప్రసాద్‌కు పెద్దిరెడ్డి లేఖను అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డిని ఎక్స్ అఫిషియో సభ్యుడిగా నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలయ బృందానికి యూనిఫాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఈఓ


కాణిపాకం: ఆలయ అధికారులు, సిబ్బంది యూనిఫాం దుస్తులు ధరించేలా చూస్తామని ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో వెంకటేశు తెలిపారు. ఆలయంలోని సమావేశమందిరంలో సోమవారం వారు అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తుల వసతులు, మాస్టర్ ప్లాన్ పురోగతిపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆధ్యాత్మికం ఉట్టిపడేలా ఆలయ బృందం మంచి వస్త్రధారణ, వినాయకస్వామి తిలకం ధరించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. జూలై 15వ తేదీ నుంచి ఈ విధానం అమలయ్యేలా చూస్తామన్నారు. ఉభయదారులు, అధికారుల సహకారాలతో ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని వారు పేర్కొన్నారు.

అమ్మకానికి ఇంజినీరింగ్ సీట్లు

పేద, మధ్యతరగతి వర్గాలు ఇంజినీరింగ్, డిప్లొమా, ఇతర కోర్సులను చదివించాలంటే హడలిపోతున్నారు. ఏపీఈఏపీ సెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించని వారిని ఆయా కోర్సుల్లో చదివించాలంటే రూ.లక్షల డొనేషన్లు చెల్లించాల్సిందే. కళాశాలల మేనేజ్‌మెంట్ కోటా డొనేషన్ల వివరాలను చూసి తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. ఇంత భారీ మొత్తం ఎలా చెల్లించాలంటూ దిగులుపడుతున్నారు. పిల్లలను ఇంజినీరింగ్, ఇతర కోర్సులు చదివించే స్తోమత తమకు లేదంటూ కుంగిపోతున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఇంజినీరింగ్ కళాశాలల డొనేషన్‌ల పర్వంపై ప్రత్యేక కథనం.







ఉమ్మడి చిత్తూరు జిల్లాలో..

ఇంజినీరింగ్ కళాశాలలు	68
మెడికల్ కళాశాలలు	5
బీ ఫార్మసీ కళాశాలలు	31
ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలు	37

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో విద్యా వ్యాపారం జోరుగా సాగుతోంది. నెలరోజులుగా ప్రాథమిక, హైస్కూల్ విద్యనందించే కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో సీట్ల అమ్మకం జరుగుతుండగా, ఇటీవల ఏపీఈఏపీ సెట్ ఫలితాలు విడుదల కావడంతో ఇంజినీరింగ్ కళాశాలలు పెద్ద ఎత్తున వ్యాపారం ప్రారంభించాయి. ఏపీఈఏపీ సెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించలేని విద్యార్థులు ఇంజినీరింగ్ చదవాలంటే కచ్చితంగా మేనేజ్‌మెంట్ కోటాలో డొనేషన్‌లు చెల్లించి అడ్మిషన్‌లు పొందాల్సిందే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంజినీరింగ్ కళాశాలల్లో వసతులను బట్టి ఫీజు నిర్ణయించింది. అలాగే మేనేజ్‌మెంట్ కోటా ఫీజులను కూడా నియంత్రించేలా చర్యలు తీసుకుంది. ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గతంలో మాదిరిగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజుల పెంపుదలకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. డొనేషన్ల పర్వానికి తెరదీశాయి. ఏపీఈఏపీ సెట్‌లో అనర్హత సాధించిన విద్యార్థుల నుంచి రూ.లక్షల కొద్దీ డొనేషన్‌లు వసూలు చేస్తున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. అంత డబ్బు చెల్లించలేక తల్లిదండ్రులు హడలిపోతున్నారు.

గతంలో నేరుగా తల్లుల ఖాతాల్లోకి..

ఇంజినీరింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను గత వైఎస్సార్ సీపీ సర్కారు నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసేది. అలా చేయడం వల్ల కళాశాలలు అవకతవకలకు పాల్పడే అవకాశం లేకుండా పోయింది. గత విద్యా సంవత్సరంలో రెండు జిల్లాల్లోని ఇంజినీరింగ్ కళాశాలల్లో దాదాపు 22 వేల వరకు సీట్లు ఉండేవి. వీటిలో కన్వీనర్ కోటాలో సీట్లు కౌన్సెలింగ్‌లో పూర్తయ్యే అవకాశం ఉండగా, మేనేజ్‌మెంట్ కోటా సీట్లను ఆయా కళాశాలల యాజమాన్యాలు భర్తీ చేసుకుంటున్నాయి. కళాశాలల్లోని వసతులు, ఫ్యాకల్టీ, క్యాంపస్ సెలెక్షన్స్‌లో ప్లేస్‌మెంట్ల ఆధారంగా విద్యార్థులు ఆయా కళాశాలలకు ప్రాధాన్యమిస్తారు. ఏపీఈఏపీ సెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారు పేరున్న యూనివర్సిటీలు, కళాశాలలకు ప్రాధాన్యమిస్తుండగా మిగిలిన వారు స్థానికంగా ఉండే కళాశాలలను ఎంచుకుంటున్నారు.

నాలుగేళ్ల కోర్సుకు రూ.20 లక్షల వరకు ఖర్చు..

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పేరున్న కొన్ని ఇంజినీరింగ్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా కింద సీటుకు రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు డొనేషన్ వసూలు చేస్తున్నట్టు సమాచారం. ప్రధానంగా డిమాండ్ ఉన్న సీఎస్ఈ, ఈసీఈ కోర్సులకు మొదటి ఏడాది రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు డొనేషన్ వసూలు చేస్తుండగా, మరో రూ.2 లక్షలు ఫీజు రూపంలో చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇంజినీరింగ్ కోర్సుల్లో మిగిలిన మూడేళ్లకు ఏడాదికి రూ.2 లక్షల వరకు ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. హాస్టల్ ఫీజు ఏడాది రూ.లక్ష, ఇతర పరీక్షల ఫీజులు వంటి వాటితో ఒక విద్యార్థి నాలుగేళ్ల ఇంజినీరింగ్ పూర్తిచేసేందుకు సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా. మరికొన్ని కళాశాలల్లో రూ.3.50 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు డొనేషన్, రూ.లక్ష ఫీజు చెల్లించాలని కళాశాలలు షరతులు పెడుతున్నట్టు సమాచారం. ప్రభుత్వం నిర్ణయించే ఫీజులు ఎలా ఉన్నా కళాశాలలు నిర్ణయించే ఫీజులే చెల్లించాలని కచ్చితంగా చెబుతుండడం విశేషం.

నియంత్రించే బాధ్యత ప్రభుత్వానిదే

"ఇంజినీరింగ్ ఇతర కోర్సుల్లో మేనేజ్‌మెంట్ కోటాలో చేరాలంటే రూ.లక్షల డొనేషన్లు చెల్లించాలని యాజమాన్యాలు నిర్దేశిస్తున్నాయి. డొనేషన్‌ల విధానాన్ని కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక స్క్వాడ్‌లను నియమించాలి. ప్రతి ఇంజినీరింగ్ కళాశాలను తనిఖీ చేయించి ప్రభుత్వం నిర్ణయించే ఫీజులను మాత్రం వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలి. ఇటీవల ఏపీఈఏపీ సెట్ ఫలితాలు రావడంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ఇంజినీరింగ్ కళాశాలలు అడ్డగోలు డొనేషన్లకు తెరలేపాయి. విద్యార్థులకు అన్యాయం జరిగితే ఆందోళనలు చేపడతాం.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



అధికారులు సమన్వయంతో పనిచేయాలి

కుప్పం: జిల్లా అధికారులు సమష్టిగా సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. సీఎం పర్యటన ప్రదేశాలను సోమవారం జిల్లా ఎస్పీ మణికంఠతో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా అధికార యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పటిష్ట బందోబస్తు ఉండాలని పోలీసు శాఖకు సూచించారు. ట్రాఫిక్, వాహనాల పార్కింగ్ సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సీఎం కార్యక్రమాలకు వచ్చే ప్రజలకు స్నాక్స్, వాటర్ ప్యాకెట్స్, మజ్జిగా పంపిణీ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. మెడికల్ క్యాంప్, గ్రీవెన్స్ డెస్క్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూసుకోవాలని అధికారులకు ముందస్తుగా జాగ్రత్తలు పాటించాలని ఆయన తెలిపారు.

భారీ బందోబస్తు

కుప్పం నియోజకవర్గంలో సీఎం రెండు రోజుల పర్యటన నిమిత్తం పోలీసు శాఖ భారీ ఎత్తున బందోబస్తు నిర్వహిస్తున్నట్లు కుప్పం డీఎస్పీ శ్రీనాథ్ తెలిపారు. 1100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీలు 15 మంది, అడిషినల్ డీఎస్పీలు 40 మంది, సీఐలు 30 మంది, ఎస్ఐలు 50 మందితో పాటు ఇతరత్రా బలగాలు 950 మందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



సీఎం పర్యటన ప్రదేశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్



విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

ముస్తాబైన కుప్పం

సీఎం చంద్రబాబు రెండు రోజుల కుప్పం పర్యటనకు అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. పీఈఎస్ మెడికల్ కళాశాల నుంచి కుప్పం వరకు విద్యుత్ లైట్లు, రోడ్డు ఇరువైపులా పారిశుద్ధ్య పనులు చేపట్టి శుభ్రం చేశారు. అంతేకాకుండా పట్టణంలో నూతనంగా విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. జిల్లా అధికార యంత్రాంగం రెండు రోజుల క్రితమే కుప్పంలో మకాం వేసి ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేసింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు కలెక్టరేట్ : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో డయేరియా నియంత్రణపై జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. అందుకు తగినట్లుగా పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో తాగునీరు కలుషితమైన ప్రాంతాల్లో ప్రజలు నీటిని వినియోగించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అర్బన్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు తాగునీటి పథకాలను పరిశీలించాలని చెప్పారు. 0 నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలు డయేరియా మరణాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అంటువ్యాధులపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ప్రజా సమస్యలకే ప్రాధాన్యం

- బాధ్యతలు స్వీకరించిన నూతన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ
- నూతన కలెక్టర్‌ను కలిసిన జిల్లా అధికారులు
- వసతి గృహాల్లో సౌకర్యాలు, తాగునీటి సమస్యలపై ఆరా



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికే తన తొలి ప్రాధాన్యం ఇస్తామని నూతన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయనకు కాణిపాకం ఆలయ అర్చకులు వేద మంత్రాలతో స్వాగతం పలికారు. ఉదయం 9.30 గంటలకు ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరుతో మాట్లాడారు. గతంలో తాను పశ్చిమ గోదావరి జిల్లాలో కలెక్టర్‌గా విధులు నిర్వహించానని తెలిపారు. ప్రజలు అందజేసే సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. భూ సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వ విధి విధానాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తానని తెలిపారు.

వసతి గృహాల్లో సౌకర్యాలపై ఆరా

నూతన కలెక్టర్ బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాలపై ఆరా తీశారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మితో సాంఘిక సంక్షేమ వసతి గృహాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని తెలిపారు. జిల్లాలోని వసతి గృహాల సమగ్ర సమాచారం అందజేయాలని డీడీని ఆదేశించారు. జిల్లాలోని గ్రామాల్లో, పట్టణాల్లో తాగునీటి సమస్యలు ఎక్కడైనా ఉన్నాయా అని డీపీఓ లక్ష్మిని ప్రశ్నించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉండాలని డీపీఓను ఆదేశించారు.

కలెక్టర్‌ను కలిసిన అధికార యంత్రాంగం

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌ను జిల్లా అధికారులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్లు, కాణిపాకం ఈఓ వెంకటేశు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హుస్సేన్, చిత్తూరు నగరపాలక కమిషనర్ అరుణ, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీఈఓ దేవరాజు, వీఆర్‌ఓ అసోసియేషన్ నాయకులు బాలాజీరెడ్డి, పద్మనాభం, మార్కండేయులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

"మానవుని శరీరమే రథం
ఆత్మ..రథికుడు
బుద్ధి..సారథి
మనస్సు..పగ్గం
ఇంద్రియాలే..గుర్రాలు
విషయాలే..వీధులు
శ్రీవారు అధిరోహించిన రథోత్సవాన్ని
తిలకించే వారు పొందే తత్వజ్ఞానమిదే."

వైభవం.. ప్రసన్నుడి రథోత్సవం

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు సోమవారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారు రథాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9 గంటలకు పట్టుపీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలతో ముగ్ధమనోహర రూపంలో స్వామి అమ్మవార్లు రథారోహణం చేశారు. అనంతరం 9.25 గంటల నుంచి మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాలు, అశేష భక్తజన గోవిందనామ స్మరణలతో ఆలయ మాడవీధుల్లో రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం 5 గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశ్వరూప దర్శనం, తోమాలసేవ, కొలువు, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులను స్వామివారి సర్వదర్శనానికి అనుమతించారు. 8 గంటలకు పుణ్యాహవచనము, నవగ్రహపూజ నిర్వహించారు. 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 వరకు భక్తి కీర్తనల ఆలాపనల మధ్య స్వామివారి ఊంజల్ సేవ కనుల పండువగా సాగింది. అనంతరం శ్రీవారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు.

అశ్వంపై నుంచి అభయమిచ్చిన ప్రసన్నుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 7 గంటలకు శ్రీవారు అశ్వవాహనంపై పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో విహరిస్తుండగా అశేష భక్తజన గోవిందనామ స్మరణలతో మాడవీధులు మార్మోగాయి. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, యువతుల ఆనందడోలికల కోలాటం నడుమ స్వామివారు అశేష భక్తజనానికి అభయమిచ్చారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి స్వామివారిని కనులారా దర్శించుకున్నారు. వాహన సేవ అనంతరం స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఈఈ నరసింహమూర్తి, ఏఈఓ రమేష్, ఆలయ సూపరిండెంట్ శ్రీవాణి, కంకణ బట్టర్ సూర్యకుమారాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు పల్లకీ ఉత్సవం, 10.30 నుంచి 10.45 గంటల వరకు తీర్థవారి చక్రస్నానం, రాత్రి 7 గంటల నుంచి 7–30 వరకు నిర్వహించే ధ్వజావరోహణంతో ప్రసన్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం అవుతాయి.



మాడవీధుల్లో రథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా విహరిస్తున్న శ్రీవారు



అశ్వ వాహనంపై ఊరేగుతున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి



రథంపై కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు

క్లుప్తంగా

జలకంఠేశ్వరస్వామి ఆలయంపై ఏనుగుల దాడి


ఏనుగుల దాడిలో ధ్వంసమైన గేటు, కూలిన గోడ

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు గ్రామ సమీపంలోని జలకంఠేశ్వరస్వామి ఆలయంపై ఆదివారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. గంకొండ అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఏనుగులు ఆలయానికి అమర్చిన ఇనుప గేటును ధ్వంసం చేశాయి. ఆలయానికి సంబంధించిన గోడను కూల్చివేశాయి. సోమవారం ఉదయం ఆలయం వద్దకు వెళ్లిన నిర్వాహకులు ఆలయంపై ఏనుగులు దాడి చూసినట్లు గుర్తించారు. ఈ దాడుల్లో సుమారు రూ.30వేలు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఆలయం వైపు ఏనుగులు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని అటవీశాఖ అధికారులను కోరారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

తిరుపతి లీగల్ : ట్రాక్టర్‌ను అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరు వ్యక్తుల మృతికి కారకుడైన కేసులో పలమనేరు మండలం, పెంగరగుంటకు చెందిన టి.గురునాథానికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తిరుపతి ఆరవ ప్రత్యేక జూనియర్ జడ్జి కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. ఈస్టు స్టేషన్ సీఐ డి.మహేశ్వరరెడ్డి, కోర్టు కానిస్టేబుల్ అయ్యప్ప తెలిపిన వివరాల మేరకు.. 2019, జూలై 3వ తేదీ తిరుపతి శ్రీనివాసం సమీపంలో నిందితుడు గురునాథం సిమెంటు ఇటుకల లోడ్డుతో ఉన్న ట్రాక్టర్‌ను నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న తిరుపతికి చెందిన పి.కోదండపాణి, తమిళనాడు, వేలూరు జిల్లా, వాలాజా తాలూకా, శ్రీనివాసాపురానికి చెందిన ఎ.రాంబాబు మరణించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు తిరుపతి ట్రాఫిక్ పోలీసులు డ్రైవర్ గురునాథంపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో ట్రాక్టర్ డ్రైవర్ గురునాథానికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

దాడి కేసులో ఇద్దరు మైనర్లకు..

దాడి కేసులో ఇద్దరు మైనర్లకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి జువైనల్ జస్టిస్ బోర్డు, తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి సోమవారం తీర్పు చెప్పారు.

చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారం

- అర్జీలు స్వీకరించిన నూతన కలెక్టర్
- జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు
- అన్ని విభాగాలకు సంబంధించి వంద ఫిర్యాదుల స్వీకరణ


డీఆర్‌ఓ కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా అధికారులు ప్రజా సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బాధ్యతలు స్వీకరించిన తొలిరోజు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలందజేసేందుకు విచ్చేసిన ప్రజల సమస్యలను నిశితంగా పరిశీలించి పరిష్కారానికి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీని ఆయా శాఖల అధికారులు జవాబుదారీతనంతో సకాలంలో పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ పాల్గొని వినతులను స్వీకరించారు.

100 అర్జీల స్వీకరణ

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు 100 అర్జీలను అందజేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 77, నేషనల్ హైవే 02, చిత్తూరు నగర పాలక శాఖ 10, విభిన్న ప్రతిభావంతుల శాఖ 01, పోలీసు శాఖ 01, జిల్లా ఉపాధి కార్యాలయం 01, ఆరోగ్య శ్రీ డీపీఓ 01, బీసీ వెల్ఫేర్ 2, ఇరిగేషన్ ఎస్ఈ 02, డీపీఓ 02, ఎంపీడీఓ తవణంపల్లె 1, ఏడీ ఎస్ఎల్ఆర్‌కు 1 అర్జీ అందినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

జీతాలివ్వడం లేదు

జీతాలివ్వడం లేదు సారూ అంటూ దళిత ప్రజావేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధనంజయరావు అన్నారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు డీఆర్‌ఓకు అర్జీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 12 మంది డ్రైవర్లు పనిచేస్తున్నారన్నారు. ఎస్సీ కులానికి చెందిన వీరందరికీ గత 9 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యపై కమిషనర్ అరుణను అడిగితే అసలు మీరు ఎవరో తనకు తెలియదని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని వాపోయారు. జీతాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్పందించి న్యాయం చేయాలని కోరారు.

20 కిలోల బియ్యం ఇప్పించండి


కలెక్టర్‌కు సమస్యను నివేదిస్తున్న సెల్వం

రేషన్‌షాపులో తనకు 20 కిలోల బియ్యం ఇప్పించాలని చిత్తూరు నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన సెల్వం కోరారు. బాధితుడు కలెక్టర్‌కు అర్జీని అందజేశారు. ప్రమాదంలో తన కాలికి గాయం కావడంతో జీవనాధారం లేదన్నారు. ఎలాంటి పనికి వెళ్లలేని స్థితిలో ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం తనకున్న రేషన్‌కార్డులో 5 కిలోల బియ్యం ఇస్తున్నారని కోటాను పెంచి 20 కిలోల బియ్యం ఇప్పించాలని కోరాడు.

కబ్జాకు ప్రయత్నం చేస్తున్నారు


కలెక్టర్‌కు విన్నవిస్తున్న వెంకటరమణ

తన అనుభవంలో ఉన్న 1.10 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని బాధితుడు వెంకటరమణ కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. జిల్లాలోని చౌడేపల్లి మండలం బండమీదపల్లెకు చెందిన ఆయన కలెక్టర్‌కు అర్జీని అందజేశారు. బాధితుడు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి వస్తున్న 1.10 ఎకరాల భూమిని సాగు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు తెలిపారు. తనకు జీవనాధారంగా ఉన్న భూమిని కాజేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

పింఛన్ ఇప్పించండయ్యా

అర్హుడైన తనకు పింఛన్ ఇప్పించండయ్యా అంటూ చిత్తూరు నగరంలోని తోటపాళేనికి చెందిన జయరాం వాపోయారు. ఈ మేరకు ఆయన అధికారులకు అర్జీ అందజేశారు. ఆయన మాట్లాడుతూ పింఛన్ పొందేందుకు తనకు అర్హత ఉందని చెప్పారు. అయినప్పటికీ చాలా సార్లు అధికారుల వద్దకు వెళ్లి అర్జీ ఇచ్చినా మంజూరు చేయడం లేదని వాపోయారు. అర్జీని పరిశీలించిన కలెక్టర్ వెంటనే సమస్యను పరిష్కరించాలని డీఆర్‌డీఏ శాఖ అధికారులను ఆదేశించారు.

క్రికెట్ కొట్లాట

- దళిత యువకులపై దాడి
- మాట్లాడాలని చెప్పి కట్టేసి కొట్టిన వైనం
- వావిల్‌చేను గ్రామంలో ఘటన

వెదురుకుప్పం: దళిత యువకులపై అగ్రవర్ణం వారు అమానుషంగా దాడి చేశారు. క్రికెట్ పోటీల్లో రెండు వర్గాల మధ్య రగిలిన చిచ్చు కారణంగా మాట్లాడదాం రమ్మని పిలిచి దళిత యువకులను స్తంభాలకు కట్టేసి కొట్టారు. దీంతో బాధితులు వెదురుకుప్పం పోలీసులను ఆశ్రయించారు. మండలంలోని వావిల్‌చేను గ్రామంలో ఆదివారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది.

పోలీసుల కథనం మేరకు, గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం మారేపల్లె, వావిల్‌చేను బృందాలు క్రికెట్ పోటీల్లో తలపడ్డాయి. ముందుగా వావిల్‌చేను టీం బ్యాటింగ్ చేయగా తరువాత బ్యాటింగ్‌కు వచ్చిన మారేపల్లె టీంకి స్కోర్ విషయమై తేడా రావడంతో రగడ మొదలైంది. ఈ క్రమంలో క్రికెట్‌తో సంబంధం లేని వావిల్‌చేను గ్రామానికి చెందిన బెనర్జీ తన వద్ద ఉన్న బైక్ కీస్‌తో మారేపల్లెకు చెందిన ఉదయ్‌పై దాడి చేశాడు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం ముదిరింది. ఆ తరువాత మారేపల్లె టీం వెనుదిరిగి ఇంటికి వెళ్లిపోయింది. అయితే వావిల్‌చేనుకు చెందిన వారు ఆదివారం సాయంత్రం మళ్లీ మాట్లాడుదాం రండి అని మారేపల్లె టీం సభ్యులకు ఫోన్‌చేయడంతో భాస్కర్, ఉదయ్‌తోపాటు కొందరు వావిల్‌చేను గ్రామానికి వెళ్లారు. అప్పటికే సిద్ధంగా ఉన్న అక్కడి అగ్రవర్ణం వారు గ్రామానికి వచ్చిన దళిత యువకులను స్తంభానికి కట్టేసి కొట్టారు.

బాధితులు సోమవారం సాయంత్రం వెదురుకుప్పం పోలీసులను ఆశ్రయించారు. వావిల్‌చేను గ్రామానికి చెందిన బెనర్జీ రెడ్డి, చాణక్య, వేణుగోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, హరి, గుణశేఖర్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు ముందస్తు బెయిల్

తిరుపతి లీగల్: సార్వత్రిక ఎన్నికల అనంతరం జూన్ 13వ తేదీన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై నమోదైన కేసులో ముగ్గురికి చిత్తూరు ఆరవ అదనపు జిల్లా జడ్జి కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసినట్టు న్యాయవాది యు.శేఖర్ బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ టీడీపీకి చెందిన ఓ మహిళా కార్యకర్త ఫిర్యాదు మేరకు కూచువారిపల్లెకు చెందిన కొటాల చంద్రశేఖర్‌రెడ్డితోపాటు 12 మందిపై చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. దీనిపై కొటాల చంద్రశేఖర్ రెడ్డితోపాటు నవీన్, బాలు అలియాస్ బాలాజీ ముందస్తు బెయిల్ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వారి వాదనలు విన్న న్యాయమూర్తి ముగ్గురికీ ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కొక్కరు రూ.20వేల చొప్పున ఇద్దరు జామీన్ దారుల పూచీకత్తుపై విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు ముగ్గురు సోమవారం తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జామీనుదారులను హాజరు పరచి బెయిల్ పొందారు.

దాడికి యత్నం?

కోర్టులో జామీనుదారులను హాజరుపరిచేందుకు వచ్చిన కొటాల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులపై 60 మంది టీడీపీ కార్యకర్తలు దాడికి యత్నించారు. దీనిపై ముందస్తుగా సమాచారం అందుకున్న కొటాల తదితరులు వెంటనే పోలీసులకు ఫిరాదు చేశారు. దీంతో పోలీసులు రక్షణ కల్పించారు. కోర్టు నుంచి వారు ఇళ్ల వెళ్లేవరకు వెంట నడిచారు. ఈ మేరకు న్యాయమూర్తులకు సైతం టీడీపీ కార్యకర్తల విషయం తెలిసినట్లు సమాచారం.

29న జాతీయ లోక్ అదాలత్


న్యాయమూర్తి గురునాథ్

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో ఈనెల 29వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవ సంస్థ చైర్మన్ ఎం.గురునాథ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు అదాలత్ ప్రారంభమవుతుందన్నారు. కేసుల పరిష్కారం కోసం ప్రత్యేకంగా 8 బెంచ్‌లు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. బెంచ్‌లకు అధ్యక్షులుగా తనతో పాటు తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి అర్చన, తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బి.విజయ సారథిరాజు, జూనియర్ సివిల్ జడ్జిలు సత్యకుమార్, కోటేశ్వరరావు, సంధ్యారాణి, గ్రంధి శ్రీనివాస్, వై.సరిత వ్యవహరించనున్నట్లు వివరించారు. రాజీ చేసుకోదగిన క్రిమినల్ , సివిల్, యాక్సిడెంట్, వివాహ సంబంధిత, ఇతరత్రా కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. న్యాయవాదులు, పోలీసులు, ఇతర అధికారులు కేసుల పరిష్కారానికి సహకరించాలని కోరారు.

గ్రీన్‌హౌస్ వినియోగానికి దరఖాస్తులు

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీ గ్రీన్‌హౌస్ క్రాప్ ఎంటర్‌ప్రైజస్ వినియోగించుకునేందుకు ఆసక్తిగల మహిళా పారిశ్రామిక వేత్తలు, ఇంక్యుబేటర్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు www.spmvv.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

కలగానే చిత్తూరు రైల్వే జంక్షన్

- చిత్తూరు మీదుగా వెళుతున్నా.. నో స్టాపింగ్
- ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఇక్కడ ఆగని రైళ్లు
- గోప్యంగా అధికారుల పర్యటనలు


చిత్తూరు రైల్వే స్టేషన్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో చిత్తూరు రైల్వే జంక్షన్ కలగానే మిగిలిపోతోంది. ప్రభుత్వాలు మారినా జిల్లాకు మాత్రం రైల్వే జంక్షన్ ఏర్పాటు చేయడం లేదు. కేంద్రంలోని రైల్వే సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జిల్లావాసులు కోరుతున్నారు. పలు రైళ్లకు చిత్తూరులో స్టాపింగ్ ఇచ్చే విధంగా ఎంపీలు ప్రయత్నం చేస్తారని ఆశలు పెట్టుకున్నారు. అయితే అధికారులు కూడా ఈ సమస్యల పరిష్కారానికి శ్రద్ధ చూపడం లేదు. రైల్వే ఉన్నతాధికారులు చిత్తూరు పర్యటనకు వచ్చినప్పుడు, స్థానిక అధికారులు గోప్యత పాటిస్తున్నారు. ముందుగా తెలిస్తే స్థానికులు ఫిర్యాదులు చేస్తారన్న భయంతో వారు ఎవరికీ సమాచారం ఇవ్వడం లేదు.

రెండు రాష్ట్రాల సరిహద్దు

ఇటు తమిళనాడు అటు కర్ణాటక రెండు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉంది చిత్తూరు. కానీ ఈ మార్గంలో వెళ్లే పలు రైళ్లకు స్టాపింగ్స్ లేవు. ఈ రైళ్లలో ప్రయాణించాలంటే, జిల్లావాసులు తిరుపతి, కాట్పాడి, పాకాలకు వెళ్లి రైలెక్కాల్సిన పరిస్థితి. జిల్లావాసులకు వేలూరు, చెన్నై, బెంగళూరుకు వ్యాపార, ఉద్యోగ, బంధుత్వాల రీత్యా ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. కానీ చిత్తూరు నుంచి నేరుగా వెళ్లేందుకు రైలు సౌకర్యం లేకుండా పోయింది. గతంలో ఈ విషయాలన్నీ అప్పటి ఎంపీ రెడ్డెప్ప పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు స్పందించలేదు.

ప్రస్తుతం ఉండే సర్వీసులు

చిత్తూరు–సికింద్రాబాద్–త్రివేండ్రం, హౌరా–యశ్వంత్‌పూర్, తిరుపతి–కాట్పాడి, న్యూఢిల్లీ–త్రివేండ్రం, కాకినాడ–బెంగళూరు, తిరుపతి–కాట్పాడి, కాచిగూడ–చిత్తూరు, తిరుపతి–కాట్పాడి, తిరుపతి–విల్లుపురం, పూణె–కన్యాకుమారి, తిరుపతి–కాట్పాడి, తిరుపతి–మైసూర్ రైలు సౌకర్యం ఉంది.

చిత్తూరు మీదుగా వెళుతూ ఆగని రైళ్లు

తిరుపతి–రామేశ్వరం, హౌరా–పాండిచ్చేరి, ఓకా–రామేశ్వరం, తిరుపతి–రామేశ్వరం, టాటా–యశ్వంత్‌పూర్, కన్యాకుమారి, హతియా–యశ్వంత్‌పూర్, హౌరా–పాండిచ్చేరి, రైళ్లు చిత్తూరు మీదుగా వెళ్తున్నప్పటికీ ఇక్కడ స్టాపింగ్స్ లేవు. ఈ రైలులో ప్రయాణించాలంటే పాకాల లేదా తిరుపతికి వెళ్లి ఎక్కాల్సిందే.

ఇవి జిల్లావాసుల వినతులు

- వేలూరు నుంచి చైన్నెకు వెళ్లే రైలును చిత్తూరులో నుంచి ఎక్కే సౌకర్యం కల్పించాలి.
- చిత్తూరులోని పీసీఆర్ కళాశాల వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మిస్తే పాదచారులు, వాహనదారులు, విద్యార్థుల రాకపోకలకు అనువుగా ఉంటుంది.
- విల్లుపురం–తిరుపతి రైలు రాత్రి 9.30 గంటలకు కాట్పాడి నుంచి బయలుదేరే అవకాశం కల్పించాలి.

రూ.14 కోట్లు విడుదల

చిత్తూరు రైల్వేస్టేషన్‌కు అమృత్‌భారత్ కింద దాదాపు రూ.14 కోట్లు నిధులు విడుదలయ్యాయి. దీంతో స్టేషన్ మొత్తాన్ని పూర్తిగా ఆధునీకరించి వసతులు కల్పించనున్నారు. ఇందులో భాగంగా పనులు మొదలయ్యాయి. నిత్యం వీటి పర్యవేక్షణకు ఉన్నతాధికారులు వస్తుంటారు. కానీ వారి రాకను స్థానిక అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. వారి పర్యటన తెలిస్తే స్థానిక సమస్యలను ఏకరువు పెడతారు. అయితే ఉన్నతాధికారులు వీటిని పట్టించుకోకుంటే రైల్వే శాఖ పరువు పోతుందని వారు మిన్నకుండిపోతున్నారు.

లిఫ్ట్ ఎక్కని హామీ

స్థానికంగా రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ సదుపాయం కల్పిస్తే గర్భిణులు, వృద్ధులు, పిల్లలు రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది. కానీ ఆ సదుపాయం 10 రోజుల్లో కల్పిస్తామని సికింద్రబాబు ఏజీఎం, గుంతకల్లు డీఆర్ఎం లిఫ్ట్ సౌకర్యం 15 రోజుల్లో కల్పిస్తామని చెప్పి 4 నెలలు అవుతున్నా దిక్కులేదు. రైల్వే జంక్షన్ లేని జిల్లా కావడంతో సమస్యలు పట్టడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజు 3,600మంది ప్రయాణికులు చిత్తూరు రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతి రోజు టికెట్, పార్శిల్ సర్వీసు, పలు మార్గాల్లో రూ.3లక్షలు ఆదాయం వస్తోంది. రైళ్ల రాకపోకలను తెలుసుకోవడానికి విచారణ విభాగం పనిచేయడం లేదు. ప్రయాణికులతో సిబ్బంది అమర్యాదగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు ఉన్నా యి. వేలాది మంది ప్రయాణిస్తున్నా ఇక్కడ ఏటీఎం సదుపాయం లేదు. ఎక్కడ చూసినా పారిశుధ్య లోపం కనిపిస్తోంది. చిన్నపాటి వర్షానికి బురదగా మారుతుంది. స్టేషన్ ఆవరణలో ఉండే ఆటోవాలాలు రెట్టింపు ధరలతో దోచుకుంటున్నారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద బుకింగ్ పాయింట్ ఏర్పాటు చేస్తే స్థానికులకు సౌకర్యంగా ఉంటుంది.

మరువలేఖ

- మధుర జ్ఞాపకాలను మిగిల్చిన ఉత్తరం
- ఒకప్పుడు తంతి తపాలా ద్వారానే సమాచారం
- ఇప్పుడు వాట్సాప్ మెసేజ్‌లతో సరిపెట్టేస్తున్న జనం


నిరుపయోగంగా మారిన పోస్టుబాక్స్



ఉత్తరాలు వేరు చేస్తున్న పోస్టుమన్


కడివేడులోని పోస్టాఫీసు

చిల్లకూరు : తోక లేని పిట్ట తొంభై ఆమడల దూరం పోయింది.. అది ఏంటీ అనే సామెత అడిగిన వెంటనే 'ఉత్తరం' అని సమాధానం వచ్చేది. అయితే ఇప్పుడు ఆ మాట చెప్పుకునేందుకే తప్ప.. ఉత్తరం రాసేవారే కరువయ్యారు. పోస్టు అని ఇంటి ముంగిట పోస్టు మ్యాన్ కేక వేయగానే.. ఉత్తరం అందుకునేందుకు ఉరుకున వచ్చేవారు. తమ బంధుమిత్రులు అందించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు ఉత్సుకతతో ఉత్తరాల కోసం ఎదురుచూసేవారు. మంచి వార్తను మోసుకొచ్చిన జాబులను భద్రంగా దాచుకునే వారు. ఆ రోజులు మధుర జ్ఞాపకాల్లా మిగిలిపోయాయి. నేటి సమాజంలో పిల్లలకు పోస్టులో ఉత్తరం వచ్చి దానిని చదువుకుని ఎంతో తృప్తి పడే వారమని పెద్దలు చెబితే.. ఇంకా లేఖలు ఏంటి.. నేరుగా సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటున్నాం కదా అని అంటున్నారు. అయితే ముఖాముఖీగా వాట్సాప్ కాల్స్‌లో మాట్లాడుతున్నా, సంబోధనలో ఎన్నో మార్పులు ఉంటాయి. అయితే ఉత్తరంలో పలకరింపులు సంప్రదాయబద్ధంగా ఉంటూ మనసును ఆకట్టుకుంటాయి. పెద్దలైతే మహారాజశ్రీ, చిన్న వారైతే చిరంజీవి, మహిళలను లక్ష్మీ సమానురాలైన, వితంతువులైతే గంగా భాగీరథీ సమానులైన అని సంబోధించేవారు. అలాగే ఉత్తరం ముగింపులో కూడా పెద్దలకు నమస్కారంతో అని, చిన్నవారికి ఆశీస్సులతో అని రాసేవారు. ఎవరైనా కాలం చేసిన వార్తను ఉత్తరంలో రాసేప్పుడు ఒక వైపున నలుపు రంగు ఉండేలా చూసేవారు. ఆ ఉత్తరాన్ని ఇంట్లోకి తీసుకెళ్లకుండా బయటనే చించివేసేవారు. అలాగే ముఖ్యమైన సమాచారం ఉండే లేఖరను జాగ్రత్తగా ఒక కమ్మీకి కుట్టి పెట్టే వారు.

స్మార్ట్‌ఫోన్ ప్రభావంతోనే..

ఉత్తరాలు రాసుకునే రోజుల్లో ప్రేమలేఖ, శ్రీవారికి ప్రేమలేఖ, ఇలా ఎన్నో లేఖలపై సినిమాలు తీశారు. అవి ప్రేక్షకులను సైతం విశేషంగా అలరించాయి. అయితే నేటి యువత చేతిలోకి వచ్చిన స్మార్ట్ ఫోన్ ను గంటల తరబడి వాడుతున్నప్పటికీ అవతల వారి పూర్తి యోగ క్షేమాలు మాట్లాడే పరిస్థితి కూడా లేదు. ఒకటి రెండు మాటలు మాట్లాడిన తర్వాత టిక్ టాక్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రామ్ ఇలా వేరే వ్యాపకాలకు మొగ్గుచూపుతున్నారు. క్షేమ సమాచారాలను కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులతో పంచుకునేందుకు కూడా ఇష్ట పడడం లేదు. ఉత్తరాలు రాసుకునే సమయంలో మరో ఉత్తరం వచ్చే వరకు ఎదురు చూపులు ఉండేవి. సమయం లేక రాయలేని వారికి ఉత్తరం రాసి చాలా రోజులైందనే దిగులు ఉండేది. కానీ నేడు స్మార్ట్ ఫోన్‌ల రాకతో ఉత్తరాల ఊసే లేకుండా పోయింది. దీంతో యువత అరకొర సందేశాలను పంపుకుని సంతోష పడుతున్నారే కానీ, పాత కాలంలో లాగా పూర్తి సమాచారం చదువుకుని తృప్తి పడలేక పోతున్నారు.


పోస్టు కార్డు

అక్షర దోషాలు గుర్తించే వెసులుబాటు



ఉత్తరం రాసే సమయంలో వాటిలో ఎలాంటి తప్పులు దొర్లాయి అనే విషయాన్ని చదువుకున్న వారు గుర్తించేవారు. తెలిసినవారు ఇలా రాయకూడదు.. అలా రాయాలి అని చెప్పేవారు. దీంతో తప్పులు సరి దిద్దుకునే అవకాశం ఉండేది. అక్షర దోషాలను పక్కాగా గుర్తించే వెసులుబాటు ఉండేది. అయితే ఇప్పుడు రాసే పనేలేకుండా పోయింది. స్మార్ట్‌ఫోన్‌లో వాయిస్ మెసేజ్ పెడుతున్నారు. దీంతో ఎవరికీ ఎలాంటి ఉపయోగం ఉండదు.

– ప్రజేంద్రరెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు, పారిచెర్లవారిపాలెం, చిల్లకూరు మండలం

సంతోషంగా ఉండేది



ఉత్తరాలు రాసుకుని అందులోని సమాచారం మననం చేసుకుంటూ మరో ఉత్తరం వచ్చే వరకు ఎదురు చూడడం ఎంతో చక్కగా ఉండేది. ఎందుకంటే ఉత్తరంలో రాసే ప్రతి అక్షరం మన మనసు లోని భావాలను ప్రతిబింబిస్తాయి. చదువు రాని వారు సైతం తమకు వచ్చిన ఉత్తరాన్ని తీసుకుని వచ్చి చదవమని ఇచ్చేవారు. ఆ సమయంలో అందులో వారికి సంబంధించిన మంచి విషయాలను చెబుతుంటే ఎంతో సంతోషంగా ఉండేది. పెద్ద వారికి ఏదైనా సమాచారం తెలియజేయాలంటే ఉత్తరం ఒక సాధనంలా ఉండేది. ఇంటికి దూరంగా ఉన్న పిల్లలను హెచ్చరించేందుకు ఉపయోపడేవి.

–లలితమ్మ(విశ్రాంత ఉపాధ్యాయురాలు, ఏరూరు, చిల్లకూరు మండలం)